

● న్యూస్‌బాక్స్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

జైనూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన ఇంరిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగ వంతం చేయాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని మార్లావాయి, సుకుడ్ పెల్లి, దుబ్బగూడ తదితర గ్రామాల్లో ఆయన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పేద ప్రజలకు పక్కా ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం ఒక్కో ఇంటికి ఐదులక్షల రూపాయలు మంజూరు చేస్తుందని తెలిపారు. ఇళ్ల నిర్మాణంలో అవకతవకలు జరిగితే కఠినచర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రా మాల కార్యదర్శులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యవర్గం

రెబ్బెన, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండల టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గంను సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేందర్, ప్రధానకా ర్యదర్శిగా సంతోష్, ఉపాధ్యక్షులుగా రవి, ఫారుకి, కార్యదర్శులుగా శ్రీనివాస్, దీప్తి, వెంకటేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కృష్ణకుమార్, కో కన్వీనర్‌గా అన్నపూర్ణ, మహిళా కన్వీనర్‌గా పద్మ, కో కన్వీనర్లుగా చైతన్య, మౌనిక, అకాడమిక్ విభాగం కన్వీనర్‌గా అర్జున్, కో కన్వీనర్‌గా శివ, సాంస్కృతిక విభాగం కన్వీనర్‌గా శారద, కో కన్వీనర్‌గా కృష్ణవేణి, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా లచ్చన్న, కకులి, అనసూర్య, సోహల్ మీడియా కన్వీనర్‌గా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు.

● నిబంధనల సడలింపుతో ఉత్సాహం
● జీ+1 నిర్మాణాలకు అనుమతి
● లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



ఊపందుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కాగజ్‌నగర్ పట్టణంలో ఊపందుకున్నాయి. సుమారు 80 శాతం ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందని అధికారులు ప్రకటించారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేయగా, జిల్లాలో 1,625 మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. కాగజ్‌నగర్ పట్టణంలో 500 ఇళ్లగానూ సుమారు 387 ఇళ్లు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. 310 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ పూర్తి కాగా, మరో 111 ఇళ్లు గోడలు పూర్తి కావస్తున్నాయి. వివిధ దశల్లో ఉన్న వాటికి బిల్లుల చెల్లింపుల్లో కూడా జాప్యం రాకుండా డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల్లో ఆఖరి దశ పూర్తి చేసుకొని మరో రెండు నెలల్లో ఇళ్ల నిర్మాణానికి పూజా కార్యక్రమాలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మిగిలిన 20 శాతం మంది లబ్ధిదారులకు కూడా రుణాలు అందించి ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నప్పటికీ సాంకేతిక కారణాలతో ఇబ్బంది పడుతున్నారు. పట్టణ ప్రాంతాల్లో, మురికి వాడల్లో నివసిస్తున్న వారికి చిన్న పాటి స్థలం ఉండడంతో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనప్పటికీ కట్టుకోలేని వారికి ప్రభుత్వం నిబంధనలు సడలించడంతో ఆనందం వ్యక్తం అవుతోంది.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంటేశ్ దోత్రె, అధికారులు(ఫైల్)

● నిబంధనల సడలింపుతో మరింత వేగం

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిబంధనలు సడలించడంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జిల్లా వ్యాప్తంగా వేగం పుంజుకునే అవకాశాలున్నాయి. మొత్తం 1,625 ఇళ్ల మంజూరుకు గానూ 1,000కి పైగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. పలు కారణాలతో నిర్మాణం చేపట్టకుంటే వారి వద్ద నుంచి నాన్ విల్లింగ్ పత్రాలు తీసుకొంటున్నారు. గతంలో మొదటి విడతలో స్థలంలేక ఇబ్బం దులు పడి నిర్మాణం మొదలు పెట్టలేని వారికి 400 చదరపు అడుగుల్లోనే నిర్మాణానికి అనుమతినిస్తూ జీవో జారీ చేసింది. 400 చదరపు అడుగుల కంటే తక్కువగా స్థలం ఉన్న చోట జీ+1 నిర్మాణం కూడా చేపట్టవచ్చని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. గతంలో 600 చదరపు అడుగులలోనే నిర్మాణాలు ఉండాలని నిబంధనలుండేవి. అయినా కూడా నిర్మాణం చేపట్టేందుకు ఆసక్తి లేకుంటే రాయించుకొని సంబంధిత శాఖకు పంపిస్తున్నారు. వీటి స్థానంలో ఎవరిని ఎంపిక చేస్తారో ఇంకా తెలియడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఇళ్లు మొదలు పెట్టని లబ్ధిదారుల కోసం వెసులుబాటు కల్పించడంతో లబ్ధిదారులకు తెలియజేసేందుకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

- రాజేందర్, మున్సిపల్ కమిషనర్, కాగజ్‌నగర్

ప్రభుత్వం సవరించిన నిబంధనలతో కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో చాలామందికి నిర్మాణం చేసుకునే వీలు దక్కింది. ప్రభుత్వం నూతన ఆదేశాలతో పేదలకు లబ్ధి చేకూరుతుంది. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

వాంకిడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో షీ టీం సభ్యులు విద్యార్థులకు మాదకద్రవ్యాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చేరాలని సూచించారు. మత్తు పదార్థాలకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పేర్కొన్నారు. బాల్య వివాహాలు జరగకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై పోశెట్టి, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, సంఘవి, రజిత, ప్రధానోపాధ్యాయులు నటరాజ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డులకు వాసవి క్లబ్ సభ్యుల ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా మంథనిలో నిర్వహించిన వాసవి క్లబ్ వార్షిక సదస్సులో ఆసిఫాబాద్ వాసవి క్లబ్‌కు చెందిన క్లబ్ సభ్యు లు పలువురు ఉత్తమ అవార్డులు అందుకున్నారు. ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఉత్తమ అధ్యక్షుడిగా పాత శ్రీనివాస్, కార్యదర్శిగా కృష్ణమూర్తి, కోశాధికారిగా కిశోర్, ఉత్తమ క్లబ్ గవర్నర్‌గా కిశోర్ అవార్డులు పొందారు. కార్యక్రమంలో సభ్యులు శ్రీనివాస్, ప్రశాంత్, శ్రీనివాస్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ కమిటీ ఎన్నిక

రెబ్బెన, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలంలోని దుర్గామాత ఆలయంలో సోమవారం మంచిర్యాల జిల్లా సంఘటన కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ ఖండ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఘన్‌శాయం చౌడ, ఉపాధ్యక్షులుగా మహేందర్, మనీష్, కార్యదర్శిగా వేణుగోపాల్, సహాయ కార్యదర్శులుగా సావమి, బాలకృష్ణ, బజరంగ్ దళ్ సంయోజక్‌గా సంజీవ్, సాయికిరణ్ శర్మ, గోరక్షత్ సంయోజక్‌గా రాజ్‌కుమార్, సత్సంగ్ ప్రముఖ్‌గా వినయ్, సహాసత్సంగ ప్రముఖ్‌గా అభినయ్‌ను ఎన్నుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీవాసవి హైస్కూల్ విద్యార్థిని దాసరి శ్రేష్ట రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈ నెల 7 నుంచి 9 వరకు నారాయణపూరలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు తరఫున పాల్గొన్న క్రీడాకారులు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. ఈ టీంలో శ్రేష్ట ఉత్తమ ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా ఆమెను ప్రిన్సిపల్ మహేశ్వర్‌రావు, కరస్పాండెంట్ ప్రసాద్, సభ్యులు రాజకుమార్, సురేష్‌కుమార్, అజయ్, క్రాంతికుమార్‌లు అభినందించారు.

న్యాయం చేయాలని ఆందోళన



ఆందోళనకారులతో మాట్లాడుతున్న డీఎస్పీ వహిదుద్దీన్

దహెగాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అక్రమ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దహెగాం మండలంలోని కల్వాడ తండా వాసులు సోమవారం కల్వాడ వద్ద బెల్లంపల్లి- దహెగాం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 171లో 10.20 ఎకరాల భూమిని తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసి స్టెంట్ కళావతి హట్కర్ మధుకర్, హట్కర్ తుకారాం, జరుపుల హనుమంతు, జరుపుతుల శ్యాం పట్టా చేశారని వారు పేర్కొన్నారు. జిల్లా అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రహదారిపై బైఠాయింపుతో వాహనాలు నిలిచి పోయాయి. ఎస్ఐ విక్రమ్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడినా ఆందోళనకారులు తమ నిరసనను కొనసాగించారు. సంఘటన స్థలానికి కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదుద్దీన్ చేరుకుని కల్వాడ తండావాసులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

- అదనపు కలెక్టర్ డేవిడ్



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డేవిడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

కెరమెరి మండల ధనోరా గ్రామానికి చెందిన బాలు తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. కెరమెరి మండలం పిప్పిరి గ్రామానికి చెందిన ఎల్లక్క, తాము సాగు చేసిన కంది, మొక్కజొన్న పంటలు భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్నాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన అన్వర ఉల్లా హక్ తన పేరిట పట్టాగల భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని కోరారు. జైనూరు మండలం పానపటార్ గ్రామానికి చెందిన గిరిజన రైతులు ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద పక్కా ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. కౌటాల మండల కేంద్రానికి చెందిన ముత్తయ్య మండల కేంద్రంలోని వారసంతలో స్వచ్ఛభారత్ కింద నిర్మించిన మూత్రశాలలకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. వాంకిడి మండల కేంద్రానికి చెందిన దుర్గం శ్యాంరావు ఏజెన్సీ ప్రాంతాల్లో పోడు భూములు సాగు చేస్తున్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనకబడిన తరగతుల వారికి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ఆకట్టుకున్న గ్రీన్ చాంపియన్ మేళా

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో సోమవారం పిప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి గ్రీన్ చాంపియన్‌షిప్ పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లాలో ఎంపికచేసిన పది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇంధన ఆదా, పర్యావరణ పరిరక్షణ అంశాలపై తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిలో అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి ట్రోఫీలు, సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి బహుమతులు అందజేసిన జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి నిత్య జీవిత సమస్యలకు పరిష్కారం చూపే దిశగా తీర్చిదిద్దేందుకు విజ్ఞాన మేళాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ప్రతి ఒక్క విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించేందుకు పిప్ స్వచ్ఛంద సంస్థ వారు ప్రతీ పాఠశాలకు 4.70 లక్షల రూపాయల విలువ చేసే సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల్లో జన్కాపూర్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలువగా రాస్పెల్లి ఉన్నత పాఠశాల ద్వితీయ స్థానం, గంగాపూర్ ఉన్న పాఠశాల తృతీయ స్థానంలో నిలిచాయి.

ఈ కార్యక్రమంలో ఎంఈవో సుభాష్, ఎఫ్ఏవో దేవాజీ, ప్రధానోపాధ్యాయులు ఉమాబాల, అబ్దుల్ లతీఫ్, పీప్ సంస్థ కోఆర్డినేటర్ ప్రేంచంద్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్ చాంపియన్ మేళాలలో విజేతలుగా నిలిచి విద్యార్థులు

నాలుగు క్వింటాళ్ల బియ్యం పట్టివేత



పట్టుబడ్డ బియ్యం, నిందితులతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చింతలమానేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి మండలం గూడెం గ్రామం నుం అక్రమంగా తరలిస్తున్న నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన జునుగరి సంజీవ్ ఎక్సెల్ (టీఎస్ 20 8076)పై 1.3 క్వింటాళ్లు, చెండే మహేష్ ఎక్సెల్ (టీఎస్ 20 1087)పై 1.5 క్వింటాళ్ల బియ్యం, కొట్రంగి రామయ్య ఎక్సెల్(టీఎస్20బీ 3840) పై 1.2 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు.

బియ్యంతో పాటు మూడు ద్విచక్ర వాహ నాలను స్వాధీన పర్చుకుని పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై రాజు, హెడ్‌కానిస్టేబుల్ మహమూద్, కానిస్టేబుళ్లు విజయ్, రమేష్, హోం గార్డు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'ఉల్లాస్'తో సంపూర్ణ అక్షరాస్యులుగా మారాలి

సిర్పూర్(టి), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ శిక్షణతో సంపూర్ణ అక్షరాస్యులుగా మారాలని సీఆర్పీలు కవిత, భారతి సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ మండల సమాఖ్య భవనంలో ఉల్లాస్ అక్షర వికాసం వయోజన విద్యపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఆర్పీలు కవిత, భారతి మాట్లాడుతూ వీవో సంఘం సభ్యులు అక్షరాస్యత యువ సంఘంగా మారాలని అన్నారు. అన్ని గ్రామాల్లో నిరక్షరాస్యుల్ని గుర్తించి వంద శాతం అక్షరాస్యత సాధించేలా సభ్యులు కృషి చేయాలని సూచించారు. చదువు లేకుంటే కలిగే నష్టాలు, చదువుతో కలిసి లాభాల గురించి వారు వివరించారు. ఈ కార్యక్రమంలో లీడర్లు రాజేశ్వరి, పద్మ, మమత, తదితరులు పాల్గొన్నారు.



కరదీపికలను విడుదల చేస్తున్న సీఆర్పీలు, సమాఖ్య సభ్యులు

ఘనంగా జన జాతీయ గౌరవ దినోత్సవం



గుస్సాడి వేషధారణలో కొలాం గిరిజన విద్యార్థులు

జైనూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరి కొలాం శాటిలైట్ పాఠశాలలో విద్యార్థులు జన జాతీయ గౌరవ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆకుపచ్చటి ఆకులతో గుస్సాడీ టోపీలు తయారు చేసి ఆదివాసి సాంప్రదాయబద్ధంగా గుస్సాడీ వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థినులు గుస్సాడీ నృత్యాలు చేశారు.

ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు గౌరి, లేండిగూడ చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. జన జాతీయ గౌరవ దినోత్సవం సందర్భంగా పాఠశాల హెచ్ఎం మారుతి, ఉపాధ్యాయులు విద్యార్థులకు దండారి నృత్యం ప్రత్యేకంగా కొలామి పాటలు నేర్పారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఆట రాష్ట్ర మహాసభను విజయవంతం చేయండి

కౌటాల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న జోడేఘాట్‌లో నిర్వహించే ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఆట) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నాయకులు కోరారు. సోమవారం ఎంఆర్సీలో ఎంఈవో హనుమంతు చేతుల మీదుగా మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నానాజీ, చొక్కారావు, ఇందురావు, తిరుపతి, అశోక్, అంతయ్య, ఉద్దవ్, సాయినాథ్, రాములు, సంతోష్, సంజయ్ కుమార్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

108లో ప్రథమ చికిత్స

వాంకిడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుండె నొప్పితో బాధపడుతున్న వ్యక్తికి సోమవారం 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఎంటీ ప్రవీణ్ యాదవ్. పైలెట్ భీంరావు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన బారిక్‌రావు ద్విచక్ర వాహనంపై వాంకిడికి వస్తుండగా గోయగాం గ్రామ సమీపంలో గుండెనొప్పి రావడంతో ఊపిరి తీసుకోవడం ఇబ్బంది కలిగింది. వెంటనే 108కి సమాచారం అందించడంతో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. వెంటనే ఆక్సిజన్ అందించి ఆసిఫాబాద్ ఆసుపత్రికి తరలించారు.

కంకాలమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కౌటాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలోని కంకాలమ్మ గుట్టపై ఈ నెల 15 నుంచి జరిగే కంకాలమ్మ జాతర ఏర్పాట్లను ఎంపీడీవో ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో మహిళలకు మూత్రశాలలు, భక్తులకు తాగునీటి సదుపాయం, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కార్యదర్శి సాయిని ఆదేశించారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.

పత్తి, వరి కొనుగోళ్లు సమర్థవంతంగా చేపట్టాలి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ఆసిఫాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగా రైతులు సాగు చేసిన పంటను కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తగుచర్యలు తీసుకుంటుందని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పత్తి, వరి కొనుగోలు ప్రక్రియ రాష్ట్రంలో సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని, సరిహద్దు వద్ద అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో వీసీ హాల్ నుంచి అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా వ్యవసాయ, రవాణా, మార్కెటింగ్, పౌర సరఫరాలు, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి కొనుగోలు కోసం 40 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కొనుగోలు కేంద్రాలు ఎత్తైన ప్రదేశాల్లో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతీ కొనుగోలు కేంద్రంలో గోనె సంచులు, ప్యాడీ క్లీనర్లు, ట్యాబ్‌లు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచామని వివరించారు. తాగునీరు, నీడ, మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. పత్తి కొనుగోలు ప్రక్రియ జిల్లాలో ప్రశాంతంగా సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, జిల్లా వ్యవసాయాధికారి వెంకటి, గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, రవాణాధికారి రాంచందర్, పౌరసరఫరాల అధికారి అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్, అధికారులు

ఈతకు వెళ్లి డ్రైవర్ మృతి


శ్రీకాంత్ (ఫైల్)

మంచిర్యాల క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సరదా కోసం ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి కాలువలోనే పడి మృతి చెందాడు. మంచిర్యాల పట్టణం రాజీవ్ నగర్‌కు చెందిన శ్రీకాంత్ (30) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డ్యూటీ నిమిత్తం లారీపై చెన్నైకి వెళ్లి తిరిగి వస్తుండగా సూర్యాపేట జిల్లా గరిడెపల్లి మండలం మర్రికుంట సమీపంలో కాలువలో ఈతకు వెళ్లాడు. కాలువ వద్ద తోటి డ్రైవర్లతో కలిసి వంట చేసుకున్న అనంతరం భోజనం చేసేందుకు కాలువ వద్దకు వెళ్లి కాళ్లు చేతులు కడుక్కున్నారు. ఇంతలో శ్రీకాంత్ ఈత కొట్టేందుకు కాలువలో దూకాడు. శ్రీకాంత్ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తోటి డ్రైవర్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలానికి పోలీసులు వచ్చి గాలించగా కాసేపటికి కుంటలో శ్రీకాంత్ మృతదేహం లభ్యమైంది. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గరిడెపల్లి పోలీసులు తెలిపారు.

వేధిస్తున్న కూలీల కొరత

● పత్తి ఏరేందుకు పక్క రాష్ట్రాల కూలీలు ● మహారాష్ట్ర ఇతర రాష్ట్రాల నుంచి తీసుకు వస్తున్న రైతులు


పత్తి ఏరేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలు

సిర్పూర్(టి), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో పత్తి పంటను అధికంగా సాగు చేశారు. ఒకేసారి పత్తి చేతికి రావడంతో కూలీలకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. పత్తి ఏరడానికి కూలీల కొరత వేధిస్తుండడంతో చేసేదేమి లేక రైతులు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన కూలీలను పత్తి ఏరడానికి తీసుకువస్తున్నారు. ప్రస్తుతం పత్తి ఏరుతుండడంతో వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 20 కుటుంబాల నుంచి కూలీలు ప్రత్యేక వాహనంలో మండలానికి వచ్చారు.

కిలోకు 10 నుంచి 15 రూపాయలు

పత్తి ఏరివేతకు పక్కనే ఉన్న మహారాష్ట్రతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రైతులు తీసుకు వస్తున్నారు. కిలోకు 10 రూపాయల నుంచి 15 రూపా యల వరకు రైతులు చెల్లిస్తున్నారు. పలు కుటుంబాలు ప్రత్యేక వాహనాల్లో వచ్చారు. ఊరి చివరిలో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. పంట దిగుబడి వచ్చిన రైతులు ఫోన్‌లో సమాచారం అందించి వాహనాలకు అయ్యే ఖర్చుసైతం చెల్లించి తీసుకెళ్తున్నారు. తమ ప్రాంతాల్లో కూలీ పనులు లేక పోవడంతో ఇక్కడికి వస్తున్నట్లు తెలిపారు.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం...

ప్రతి యేడు పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది 20 వేల ఎకరాలకు పైగా పత్తి సాగు చేశారు. గత ఏడాది కంటే ఈ ఏడాది విస్తీర్ణం పెరిగినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. పత్తి పంట రైతులందరికి ఒకేసారి చేతికి వస్తుండడంతో పత్తి ఏరేందుకు కూలీల కొరత ఏర్పడుతోంది. ఒక్కోసారి కూలీలు దొరకపోవడంతో చేన్లలోనే పత్తి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది.

కూలీలు దొరకడం లేదు..

ఆత్రం దీపక్, రైతు, సిర్పూర్(టి)



స్థానికంగా పత్తి ఏరివేతకు కూలీలు దొరకక పోవ డంతో వేరే రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకువచ్చి పత్తి ఏరిపిస్తున్నాం. ఇప్పటికే అధిక వర్షాలతో పత్తి నష్ట పోవాల్సి వచ్చింది. ఉన్న కాస్తా పత్తి ఏరివేతకు కూలీ లు దొరకకపోవడంతో కిలోకు రూ.10 నుంచి రూ.15 చెల్లించి ఇతర ప్రాంతాల నుంచి రప్పించి ఏరిపిస్తున్నాం.

విద్యార్థినులతో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- డీఈవోకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు


గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

నెన్నెల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్ల సోమారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు షేక్ ఖాదర్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని గ్రామస్థులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం గురించి హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోకుండా ఉపాధ్యాయుడినే వెనుకేసుకొస్తున్నాడని గ్రామస్థులు పేర్కొన్నారు. డీఈవో ఆదేశాల మేరకు సోమవారం క్వాలిటీ కోఆర్డినేటర్ అకడమిక్ మానిటరింగ్ అధికారి సత్యనారాయణ మూర్తి, వీజీ హెచ్‌ఎం పద్మశ్రీ, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ సౌజన్య, ప్రొటెక్షన్ ఆఫీసర్ సత్తయ్య పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. 8, 9, 10వ తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. వారు చెప్పిన విషయాలను రికార్డు చేసుకున్నారు. తాము ఏడాది కాలంగా వేధింపు లు భరిస్తూ వస్తున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. తరగతిగదిలో బాలికల పక్కన వచ్చి కూర్చోవడం, పైన చేతులు వేయడం, అసభ్యకరంగా తాకడం లాంటి వెకిలి చేష్టలకు పాల్పడేవాడని తెలిపారు. పేరెంట్స్‌కు చెబితే పరీక్షల్లో ఫెయిల్ చేస్తానని బెదిరించేవాడని పేర్కొన్నారు. గ్రామస్థులు, యువకులు పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడిని రెండేళ్ల పాటు సస్పెండ్ చేయాలని, ఇలాంటి వారుంటే విద్యావ్యవస్థకే చెడ్డపేరు వస్తుందన్నారు. విచారణ అనంతరం అధికారులు మాట్లాడుతూ వేధింపుల విషయం గురించి విద్యార్థులతో మాట్లాడామని చెప్పారు. బాలికల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థుల నుంచి కూడా వివరాలు సేకరించామని చెప్పారు. నివేదిక రూపొందించి డీఈవోకు సమర్పిస్తామన్నారు. నివేదిక ప్రకారం ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

లింగాపూర్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జాముల్‌ధరా గ్రామపంచాయతీ పరిధిలోగల కన్నేపల్లి గ్రామానికి చెందిన కనక రామేశ్వర్(20) అనే యువకుడు కొన్నేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 4వ తేదీన పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు 108లో జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతు సోమవారం ఉదయం రామేశ్వర్ మృతి చెందాడే. మృతుడు రామేశ్వర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గంగన్న తెలిపారు.

అనారోగ్యంతో కార్మికురాలి మృతి

కాసిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ అదాని సిమెంటు కంపెనీలో పర్మినెంటు కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న మరప జారుబాయి(45) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందింది. క్షయ(టీబీ) వ్యాధితో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఇటీవల కరీంనగర్ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించడంతో ఆరోగ్యం కాస్త మెరుగుపడింది. మూడు రోజులుగా పెరిగిన చలితో వ్యాధి తీవ్రత పెరిగి ఆదివారం రాత్రి ఇంట్లోనే మృతిచెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సిమెంటు కంపెనీలో పనిచేసే కార్మికులు ఎక్కువ మంది టీబీ వ్యాధి బారిన పడుతున్నారని, యాజయాన్యం క్షయ వ్యాధి బారి నుంచి కాపాడాలని కార్మిక సంఘాల నాయకులు యాజమాన్యంను కోరారు.

వణుకు మొదలైంది

- తిర్యాణిలో అత్యల్పంగా 10.9 డిగ్రీల ఉష్ణోగ్రత

- పెరిగిన చలి తీవ్రత


పెంచికలపేటలో చలి మంట కాగుతున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రోజురోజుకు చలితీవ్రత పెరిగిపోతుంది. మూడు రోజులుగా జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం తిర్యాణి మండలంలో 10.9 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఉదయం శీతల గాలులతో పాటు పొగమంచు కమ్మేస్తోంది. దీంతో వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పలు మండలాల్లోని గ్రామాలు చలితీవ్రతకు గజగజలాడుతున్నాయి. ప్రజలు చలి మంటలు కాగుతున్నారు. సాయంత్రం అయిదు గంటల నుంచి చలి తీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం నుంచి ఈ నెల 19 వరకు జిల్లాలో 9 నుంచి 12 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఉదయం రాత్రి వేళల్లో అవసరముంటే తప్ప బయటకు రావద్దని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

బెజ్జూరు/పెంచికలపేట: జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతున్నాయి. జిల్లాలో కొద్ది రోజు లుగా వర్ష ప్రభావం కారణంగా చలి తీవ్రత పెరగలేదు. రెండు రోజులుగా ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో చలితీవ్రత విపరీతంగా పెరిగింది. దీంతో గ్రామాల్లో ప్రజలు నెగళ్లు వేసుకుని చలి మంటలు కాగుతున్నారు. సాయంత్రం అయిదు గంటల నుంచి చలి తీవ్రత పెరగడంతో చిన్నారులు, వృద్ధులు చలికి గజగజ వణుకుతున్నారు. ఉదయం 10 దాటిన చలి తీవ్రత తగ్గక పోవడంతో వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాబోయే పదిరోజుల వరకు చలితీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలుపుతున్నారు.

అధిక రక్తస్రావంతో గిరిజన మహిళ మృతి

వాంకిడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం చిచ్చుపల్లి గ్రామ పంచాయతీలోని ఖాతిగూడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ మడావి మారుబాయి(21) అధిక రక్తస్రావంతో సోమవారం మృతి చెందింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనిమిది నెలల గర్భవతి అయిన మారుబాయికి నాలుగు రోజుల క్రితం ఇంటి వద్ద గర్భస్రావం జరిగింది. అప్పటి నుంచి అధిక రక్తస్రావంతో బాధపడుతోంది. ఆమెను ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు నిర్లక్ష్యం వహించడంతో సోమవారం ఉదయం అధిక రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరుకుంది. కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో వాంకిడి ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. ఖాతిగూడ గ్రామం నుంచి మండల కేంద్రానికి రావడానికి సరైన రోడ్డు సౌకర్యం లేక సకాలంలో ఆసుపత్రికి చేరుకోలేక పోయామని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఇరువర్గాలపై కేసు నమోదు


దహెగాం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం కల్వాడ గ్రామంలో కల్వాడ తండాలోని ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కల్వాడ తండాలోని పలువురిని దూషించినట్లు ఇస్లావత సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హట్కురి మధుకర్‌పై కేసు చేసినట్లు తెలిపారు. అలాగే హట్కుర మధుకర్ భార్య కళావతిని దహెగాం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించడానికి వెళ్తుండగా నలుగురు మహిళలతో పాటు మరికొంత మంది దూషించినట్లు ఎస్సై తెలిపారు. హట్కుర్ మధుకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు మహిళలతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మంథనిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపూర్- నాగేపెల్లి గ్రామాల శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమవారం యువకుడు మృతి చెందాడు. మంచిర్యాలకు చెందిన తాళ్లూరి సాయిశ్రావణ్ (30) అనే యువకుడు శ్రీరాంపూర్‌లో సింగరేణిలో ఉద్యోగం చేస్తుండగా శిక్షణలో భాగంగా భూపాలపల్లికి వెళ్లాడు. తిరిగి మంథని వైపు వస్తుండగా బైకు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

'ధర్మయుద్ధం' పోస్టర్ల ఆవిష్కరణ

కెరమెరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న ఉట్నూర్‌లో నిర్వహించే హలో ఆదివాసీ చలో ఉట్నూర్ ధర్మయుద్ధం పోస్టర్లను సోమవారం ఆదివాసీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమంలో ఆదివాసీలు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, యశ్వంతరావు, ఆనంద్‌రావు, ప్రభాకర్, మారుతి, తుకారాం, తదితరులు పాల్గొన్నారు.



పారదర్శకంగా క్వార్టర్ల కేటాయింపు



మందమర్రిలో క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మందమర్రిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు సీనియారిటీ ప్రతిపాదికన పారదర్శకంగా తమ పై అధికారుల ఆదేశాల మేరకు క్వార్టర్ల కేటాయింపు చేపడుతున్నామని సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మాస్కుల కార్తీక్ తెలిపారు. సోమవారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మందమర్రి, శ్రీరాంపూర్, బెల్లంపల్లి ఏరియాలకు సంబంధించి 107 క్వార్టర్లు ప్రకటించగా 86 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. కౌన్సిలింగ్‌కు హాజరైన వారిలో సీనియారిటీ ప్రతిపాదికన 18 మందికి కేటాయించామన్నారు. ఖాళీగా ఉన్న క్వార్టర్లకు దరఖాస్తులు చేసుకున్న వారికి కౌన్సిలింగ్‌లో క్వార్టర్లను అందజేస్తామన్నారు. ఉద్యోగులందరు గమనించాలన్నారు. కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ వంశీ, మేనేజ్‌మెంట్ ట్రైనీ సివిల్ అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి లైజన్ అధికారుల నియామకం


ఆనంద్ కుమార్‌ను సన్మానిస్తున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల సమస్యల పరిష్కానికి లైజన్ అధికారుల నియామకం చేపడుతున్నట్లు శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. ఎస్‌సీ లైజన్ అధికారిగా నియమితులైన డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్‌ను జీఎం ఆధ్వర్యంలో అధికారులు సన్మానించారు. సింగరేణి సంస్థ అన్ని ఏరియాల్లో ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ లైజన్ అధికారులను నియమిస్తూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓ టు జీఎం, బీసీ లైజన్ అధికారి సత్యనారాయణ, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఎస్‌సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్ రావు, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, ఏజీఎం(ఫైనాన్స్) సుమలత, ఎస్‌టీ లైజన్ అధికారి గుండేరావు, డీజీఎంలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పని సంస్కృతి పెంపునకు సహకరించండి

- సింగరేణి సీఎండీ ఎన్ బలరాం

- సింగరేణి భవన్‌లో స్ట్రక్చరల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

మందమర్రి టౌన్/శ్రీరాంపూర్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల్లో పనిసంస్కృతి పెంపునకు సహకరించాలని సింగరేణి సీఎండీ ఎన్. బలరాం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులను కోరారు. సింగరేణి భవన్‌లో 39వ స్ట్రక్చరల్ సమావేశం నిర్వహించారు. బొగ్గు రంగంలో పోటీని తట్టుకునేందుకు ధరలను తగ్గించామని, ఈ నేపథ్యంలో ఉత్పత్తి వ్యయం తగ్గించడం అనివార్యమన్నారు. అప్పుడే సంక్షేమ కార్యక్రమాలు కొనసాగే అవకాశం ఉంటుందన్నారు. ఉద్యోగులు ఎనిమిది గంటలను పూర్తిగా పనికోసం వినియోగించాలని, యంత్రాల పనిగంటలను పెంచాలని సూచించారు. గైర్హాజరు కార్మికులు విధులకు హాజరయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఐదు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి దిశగా సింగరేణి గ్రీన్ ఎనర్జీ, కీలక ఖనిజాల అన్వేషణ, మైనింగ్‌లో భాగంగా సింగరేణి గ్లోబల్ లిమిటెడ్ కంపెనీలను ఏర్పా టు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఉద్యోగుల ఉపాధి దృష్ట్యా బొగ్గు గనుల వేలంలో పాల్గొంటామని, తద్వారా కంపెనీకి మరో వందేళ్ల భవిష్యత్ ఉంటుంద న్నారు. రూ. 300 కోట్ల వ్యయంతో గోదావరిఖని, శ్రీరాం పూర్, మణుగూరు, కొత్తగూడెం, భూపాలపల్లి, తదితర ప్రాంతాల్లో వెయ్యి క్వార్టర్ల నిర్మాణం, ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామన్నారు. గోదావరిఖనిలో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తామన్నారు. హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో సీబీఎస్ఈ సిలబస్‌తో పాఠశాలలు ప్రారంభిస్తామన్నారు. ఏఐటీ యూసీ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, సింగరేణిని అంతర్జాతీయ కంపెనీగా తీర్చిదిద్దడానికి సీఎండీ బలరామ్ అనేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, కొత్తగూడెంలో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరారు. సింగరేణిని కాపాడేందుకు తమ యూనియన్ ఎన్నో త్యాగాలు చేసినట్లు చెప్పారు. విశ్రాంత కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించాలని అన్నారు. కొత్తగూడెంలోనూ థర్మల్ పవర్ ప్లాంటు నిర్మించాలన్నారు. ఒప్పంద కార్మికుల కోసం ఈఎస్ఐ సేవలు అందించేందుకు కంపెనీ తీసుకుంటున్న చర్యలను అభినందించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పలు సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చారు. గైర్హాజరు ఉద్యోగులు ఉద్యోగం చేసేలా ఇటీవల యాజమాన్యం ప్రవేశపెట్టిన 150 మస్టర్ల విధానాన్ని ఉపసంహరించుకొని ఎలాంటి ఒత్తిడి లేకుండా గత పాత విధానాన్నే కొనసాగించ డానికి అంగీకరించిందన్నారు. కార్మిక సంఘం ప్రస్తావించిన సమస్యలను తాము పరిష్కరిస్తామని సీఎండీ తెలిపారు. డైరెక్టర్ (పర్సనల్) గౌతం పోట్రు స్వాగతోపన్యాసం చేయగా, డైరెక్టర్లు ఎల్‌వి సూర్యనారా యణ(ఆపరేషన్స్), కె. వెంకటేశ్వర్లు(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్), ఎం. తిరుమలరావు (ఈ అండ్ ఎం), జీఎం (కోఆర్డినేషన్) టి. శ్రీనివాస్, జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం కవితానాయుడు ఇతర జీఎంలు పాల్గొన్నారు.

● 150 మస్టర్ల సర్క్యులర్ ఉపసంహరణ

శ్రీరాంపూర్: స్ట్రక్చరల్ సమావేశంలో మెడికల్ బోర్డు కొనసాగింపునకు నిర్ణయం జరిగిందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కె. రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 150 మస్టర్ల సర్క్యులర్ ఉపసంహరించి పాత విధానాన్నే కొనసాగించేందుకు యాజమాన్యం ఒప్పుకుందన్నారు. సొంతింటి పథకం అమలుకు ఏర్పాటైన అధికారిక కమిటీలో యూనియన్ సభ్యులను కూడా తీసుకుంటారన్నారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్ను సమస్యను పరిష్కరిస్తామన్నారు. జేఎంఓ, ఫోర్‌మెన్ (మెకానికల్), ఫోర్‌మెన్(ఎలక్ట్రికల్), ఆఫీస్ సూపరింటెండెంట్, స్టాఫ్‌నర్స్, జూనియర్ అకౌంటెంట్, పర్సనల్ అసిస్టెంట్లకు రిక్రూట్‌మెంట్ ద్వారా ఆఫీసర్ కేడర్ ఈ1 ఇచ్చేందుకు యాజమాన్యం ఒప్పుకుందన్నారు. అన్ని గనుల్లో కబ్‌బోర్డులు, లాకర్లు ఏర్పాటు చేసేందుకు సర్క్యులర్ జారీ చేస్తారన్నారు. మారుపేర్ల విషయమై ఒక్కో కేసును విడిగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. 1000 రూపాయల లోపు పెన్షన్ పొందుతున్న వారందరికీ ప్రభుత్వం ద్వారా 2,016 రూపాయల పెన్షన్ ఇప్పించేందుకు నిర్ణయం జరిగిందని వివరించారు.

కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలి

రెబ్బెన, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్ షిప్‌లో క్వార్టర్స్ కౌన్సెలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించాలని హెచ్‌ఎంఎస్ నాయకులు హెచ్‌ఓడీ శ్రీనివాస్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ వైస్ ప్రసిడెంట్ రాజబాబు మాట్లాడుతూ గతంలో అర్హులకు కాకుండా అనుర్హులకు, ప్రైవేటు వారికి క్వార్టర్స్ కేటాయించి అర్హులైన కార్మికులకు నివాసయోగయంగా లేని క్వార్టర్లను కేటాయించారని కౌన్సిలింగ్ పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. అలాగే క్వార్టర్ల మరమ్మతులు నాణ్యతగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

30న అధికారులు, క్రీడాకారుల సమ్మేళనం

శ్రీరాంపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30న అధికారులు, క్రీడాకారుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియం పిలుస్తోంది రా అనే నినాదంతో ముద్రించిన బ్రోచర్‌ను జీఎం ఎం. శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా జీఎం కార్యాలయ ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలి

జైపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు వెంటనే చెల్లించాలని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల 7వ తేదీలోపు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలను చెల్లించాలని సీఎండీ బలరాం ఆదేశాలు ఇచ్చినప్పటికీ సంబంధిత అధికారులు తుంగలో తొక్కుతున్నారన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీరాంపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని యోగా గురూజీ షణ్ముక శివచంద్ర అన్నారు. మిషన్ హెల్తీ సింగరేణిలో భాగంగా ప్రాచీయ యోగా దినచర్య అనే కార్యక్రమం జీఎం మునిగంటి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, డీజీఎంలు అనిల్ కుమార్, రాజన్న, హరినారాయణ, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, సర్వే అధికారి నర్సింగరావు, వృత్తి శిక్షణా కేంద్రం అధికారి కమ్రుద్దీన్ పాల్గొన్నారు.

ఉత్పత్తి సాధన కోసం చర్యలు

- వర్షాలు తగ్గుముఖం

- పనులు వేగవంతం చేస్తున్న అధికారులు


గోలేటిలోని ఉపరిత గని

రెబ్బెన, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బొగ్గు ఉత్పత్తి వార్షిక లక్ష్యం ప్రారంభమైనప్పటికీ ఉపరితల గనులపై వర్ష ప్రభావం చూపుతూనే ఉంది. నెల వారి ఉత్పతి సాధన కోసం అధికారులు చేపడుతున్నప్పటికీ వాతావరణం అనుకూలించక ఆటంకం ఏర్పడుతుంది. వారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టడంతో లక్ష్యాలను అధిగమించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థ 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యం నిర్ధేశించగా ఏడు నెలల్లో అక్టోబరు వరకు 22.64 మిలియన్ల బొగ్గు ఉత్పత్తి సాధించింది. మరో ఐదునెలల్లో లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంది. అదే బెల్లంపల్లి ఏరియా వార్షిక లక్ష్యం 35 లక్షల టన్నులు కాగా, ఇప్పటికి 87 శాతం టన్నుల ఉత్పత్తి సాధించింది. ఏరియాలో ఒకే ఒక ఉపరితల గని ఖైరిగూడ ఉంది. కొత్త గోలేటి ఓసీపీకి ఇంకా మోక్షం కలుగక పోవటంతో ఏరియా మొత్తం ఖైరిగూడ ఓసీపీ పైనే ఆధార పడి ఉంది. రెండు నెలలుగా వరుసగా వర్షాలు కురియటం, మొంథా తుఫాన్ రావటంతో బొగ్గు ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపింది. నిర్దేశించుకున్న 35 లక్షల టన్నుల లక్ష్యాన్ని చేరుకోవాలంటే మరో ఐదు నెలల్లో 18 లక్షల టన్నుల సాధించాల్సి ఉంటుంది. జూన్‌లో పుంజుకుని అత్యధికంగా ఉత్పత్తి సాధించింది. వర్షాల ప్రభావంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో యాభై శాతం ఉత్పత్తి సాధించలేద. గత నెలలో ఏరియా 101 శాతంతో సంస్థలోనే ముందంజలో నిలిచింది. ఇప్పటి వరకు బెల్లంపల్లి ఏరియాలో నల వారిగా సాధించిన ఉత్పత్తి వివరాలు పరిశీలిస్తే.. ఏప్రిల్‌లో 3.50 లక్షల టన్నులకు 2.74 లక్షల టన్నులు సాధించి 78 శాతం నిలిచింది. మేలో 3.50 లక్షల టన్నులకు 3.04 లక్షల టన్నులు సాధించి 87 శాతం, జూన్‌లో 2.00 లక్షల టన్నులకు గాను 2.62 లక్షల టన్నులు 131 శాతం సాధించటం విశేషం. జూలైలో 2.00 లక్షల టన్నులకు గాను 2.00 లక్షల టన్నులు సాధించి 100 శాతం, ఆగస్టు 2.00 లక్షల టన్నులకు గాను 1.50 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించి 68 శాతం నిలిచింది. సెప్టెంబరు 2.00 లక్షల టన్నులకు గాను 0.74 37 శాతం, అక్టోబరులో 3.00 లక్షల టన్నులకు గాను 3.03 లక్షల టన్నులు సాధించి 101 శాతంతో నిలిచింది.

లక్ష్యాన్ని అధిగమిస్తాం..

-ఎం విజయభాస్కర్‌రెడ్డి, జీఎం, బెల్లంపల్లి ఏరియా



ఈ ఏడాది ఏకధాటిగా వర్షాలు కురిశాయి. ఏరియా కు 35 లక్షల టన్నుల ఉత్పత్తి ఉంది. ఇప్పటికే 87 శాతం సాధించాం. వర్షాలు తగ్గటంతో బొగ్గు వెలికితీత పనులు వేగవంతం చేశాం. మార్చి 31 కల్లా లక్ష్యాన్ని అధిగమిస్తాము.

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా అటవీ భూములను ఆక్రమించినా, వృక్షాలనునరికివేసినా క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అటవీ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీసీపీ భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్ సింగ్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, రెవెన్యూ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

గూడెంలో కార్తీక సందడి

దండేపల్లి, నవంబరు, 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురష్కరించుకుని దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణ స్వామి ఆలయంలో సోమవారం కార్తీక పూజలతో భక్తుల సందడి నెలకొంది. వేకువ జాము నుంచే వేలాది మంది భక్తులు సమీపంలోని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించిన అనంతరం ఆలయానికి చేరుకుని సత్యదేవుడిని దర్శించుకున్నారు. సుమారు 400మందికి పైగా దంపతులు శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఆలయ ధ్వజ స్థంభంతో పాటు రావిచెట్టు వద్ద మహిళలు ఉసిరి కాయలతో దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

బెల్లంపల్లి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): కన్నాల జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సోమవారం తహసీల్దార్ క్రిష్ణ ఆధ్వర్యంలో జేసీబీ సాయంతో కూల్చివేశారు. ప్రభుత్వ భూమిలో ఎవరైన అక్రమ నిర్మాణాలు చేపడితే సహించేదిలేదన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సూచించారు. ప్రభుత్వ భూముల్లో ఇందిరమ్మ ఇండ్లు కట్ట వద్దని సూచించారు. ఆయ నతో పాటు ఆర్ఐ మురళి, జీపీవోలు ఉన్నారు.

జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన గురుకుల విద్యార్థులు



విద్యార్థులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బెల్లంపల్లి, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో కాసిపేట గురుకుల విద్యార్థులు 22 పతకాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ సంతోష్ కుమార్ తెలిపారు. ములుగు జిల్లాలో జరిగిన 11వ జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో అథ్లెటిక్స్ విభాగంలోవిద్యార్థులు రాణించి స్వర్ణ, రజత, క్యాంస పతకాలను గెలుచుకున్నట్లు తెలిపారు.గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు సన్మానించారు.

పత్తిపై కత్తి కట్టిన లద్దె పురుగు



పత్తి కాయను కొరికి తింటున్న పొగాకు లద్దెపురుగు

- పంట ఆఖరు దశలో విజృంభణ
- మందులకు లొంగని మహమ్మారి
- రోజుల వ్యవధిలో చేనంతా మేస్తున్న చీడ
- పంట దక్కించుకునేందుకు రైతన్న తంటాలు

నెన్నెల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటపై పొగాకు లద్దెపురుగు కత్తి కట్టింది. పంట చివరి దశలో విజృంభిస్తోంది. మందులకు లొంగని మాయదారి చీడ రోజుల వ్యవధిలోనే చేలకు చేలనే మేసేసి పంటను నాశనం చేస్తోంది. పెట్టుబడులన్నీ పెట్టి దిగుబడులపై రైతులు పెంచుకున్న ఆశలను తొలిచేస్తోంది.

రోజుల వ్యవధిలోనే...

అధిక వర్షాలతో పత్తి పంటలో మొదటి కాత దెబ్బతి న్నది. రెండోసారి వచ్చే పూత, కాతపైనే రైతులు ఆశలు పెంచుకున్నారు. ఇలాంటి కీలక దశలో



పురుగు తినడంతో జల్లెడలా మారిన పత్తి ఆకులు

పంటపై పొగాకు లద్దె పురుగు దాడి చేస్తోంది. అధిక వర్షాలతో చల్లని వాతావరణం పురుగు ఉధృతికి తోడవుతోంది. పురుగు కనిపించిన ఒకటి రెండు రోజుల్లోనే చేనంతా వ్యాపించి పంటను నాశనం చేస్తోందని రైతులు వాపోతున్నారు. ఆకులను మేసేసి జల్లెడలా మార్చేస్తోంది. పూతను, గూడను కొరికేస్తోంది. వారం రోజుల్లోనే చేను రూపురేఖలే మారి పోతున్నాయి. గతంలో నవంబరు ఆఖరు వారం, డిసెంబరులో ఎక్కడో ఓ చోట ఈ పురుగు కని పించేదని రైతులు చెప్పారు. అప్పట్లో ఒక సారి మందు పిచికారి చేస్తే సరిపోయేదని, ఇప్పుడు మూడేసి సార్లు మందు కొట్టిన పురుగు లొంగడం లేదని అంటున్నారు. ప్రతీ రోజు వర్షాలు కురుస్తుం డటంతో అదనులోగా స్ప్రే చేసుకోలేక పోతున్నారు. పిచికారి చేసిన రోజే వర్షం వ స్తే మందు ప్రభావం తగ్గి పురుగు చావడం లేదని రై తులంటున్నారు. నివారణ చర్యలు ఆలస్యం కావడంతో మూడవ దశకు చేరిన పురుగులు రసాయణాలకు లొంగడం లేదు. దీంతో అదనంగా మందులు వాడాల్సి వస్తోంది.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

సీజన్ ప్రారంభంలో నెలన్నర రోజుల పాటు వర్షాలు లేక పత్తి పంట ఎదుగలేదు. ఆ తర్వాత ఏకధాటిగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. మొదట కాసిన కాయలు మురిగి పోయాయి. పగిలిన పత్తి నేలరాలిపోయింది. కొత్తగా వచ్చిన పై కొమ్మలు పూత పట్టి కాత కాసే సమయంలో రోగాలు చుటు ముట్టాయి. సాధారణంగా పత్తి దిగుబడి ఎకరానికి పది నుంచి 12 క్వింటాళ్లు వస్తుంది. అలాంటిది ప్రతికూల వాతావరణం, చీడపీడల ఉధృతితో దిగుబడి సగానికి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పంటపై పెట్టుబడులన్ని పెట్టేశారు. కలుపు నివారణ, ఎరువులు వేయడం, పురుగు మందుల పిచికారికి వేల రూపాయలు వ్యయం చేశారు. పంటపై ఆశతో అప్పులు చేసి అన్ని పెట్టుబడులు పెట్టామని, దిగుబడులు రాకపోతే ఏం చేయాలో తోచడం లేదని రైతులు తలలు పట్టుకుంటున్నారు.

మందులు కొట్టినా పురుగు లొంగడం లేదు..

బిరుదు స్వామి, రైతు, నెన్నెల



పది ఎకరాల సొంత చేనుతో పాటు మరో 20 ఎకరాలు కౌలు తీసుకొని పత్తి సాగు చేశాను. పొగాకు లద్దెపురుగు పత్తి పంటకు తీవ్రంగా నష్టం చేస్తోంది. ఈ సారి భారి వర్షాలతో భూమిలో తేమ అధికమై పంట సరిగ్గా ఎదగనే లేదు. ఈ పాటికే కింది కాయలు న ల్లబడిపోయాయి. పగిలిన పత్తి రాలిపోయింది. వర్షాలు తగ్గి రేగడి చేలు ఇప్పుడిప్పుడే పచ్చబడుతున్నాయి. పై కొమ్మలు పూతకొచ్చి గూడ కట్టాయి. ఆ కాతను దక్కిం చుకుందామంటే లద్దెపురుగు దాపురించింది. ఇప్పటికే అత్యంత ఖరీదైన పురుగు మందులు మూడు సార్లు స్ప్రే చేశాను. దిగుబడి సగానికి తక్కువ వచ్చేలా ఉంది. ఖర్చులేమో రెట్టింపయ్యాయి.

సత్వరం నివారణ చర్యలు చేపట్టాలి

డాక్టర్ నాగరాజు, సస్యరక్షణ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి



పొగాకు లద్దెపురుగు పత్తి పైరును అన్ని దశల్లో ఆ శించి నష్టపరుస్తుంది. ఎడతెరిపి లేని వర్షాలు కురు స్తుండటం పురుగు ఉధృతికి అనుకూలంగా ఉంది. తల్లి పురుగు ఆకుల అడుగు భాగాన చేరి గుడ్లను గుంపుగా ఒకే చోట పెడుతుంది. ఒక పురుగు జీవిత కాలం లో వెయ్యి గుడ్లకు పైగా పెడుతుంది. 4-5 రోజుల్లోనే ఆ గుడ్లన్ని లార్వాలుగా మారుతాయి. అవి పత్రహరితాన్ని గీకి తింటాయి. పెద్ద పురుగులు ఆకులను కొరికి తిని ఈనెలను మాత్రమే మిగులుస్తాయి. ఆకులతో పాటు మొగ్గలు, పువ్వులు, కాయలను ఆశించి నష్టపరుస్తాయి. పగటిపూట ఇవి మొక్కల మొదళ్లలో, భూమి పొరల్లో ఉండి రాత్రిపూట నష్టం కలుగుజేస్తాయి. వ్యవసాయ అధికారుల సూచనలతో లద్దెపురుగును సమర్ధవంతంగా నివారించుకోవచ్చు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

తాండూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు అచ్చలాపూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థిని అమూల్య ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబమూర్తి తెలిపారు. ఈ నెల 9న సోమగూడెంలోని సింగరేణి మైదానంలో జరిగిన ఎంపిక పోటీల్లో అమూల్య పాల్గొని ప్రతిభ కనబర్చిందన్నారు. ఈ నెల 13 నుంచి 16 వరకు మేడ్చల్‌లో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటుందన్నారు. విద్యా ర్థినిని సోమవారం పాఠశాలలో హెచ్ఎం ఉమాదేవి, ఏఏపీసీ చైర్మన్ చిలకమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం పోస్టర్ల విడుదల

కోటపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించే ఉచిత నేత్ర వైద్య శిబిరం పోస్టర్లను సోమవారం కోటపల్లిలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ బన్సీలాల్, ఎస్ఐ రాజేందర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని కంటి చూపుతో బాధపడుతున్న కోటపల్లి, నీల్వాయి, వేమనపల్లి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ జాడి తిరుపతి, కోశాధికారి నిమ్మల సాగర్, సభ్యులు బల్ల పోచన్న, పుద్దింటి షన్నంచంద్ పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్‌లు అమలు చేయాలని వినతి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరుతూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి సభ్యులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఏవోకు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఈ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను రాష్ట్రం అమలు చేయాలన్నారు. నాయకులు రమేష్, సదానందం, ప్రేమ్‌రావు, రాజు, సురేందర్, అజయ్, అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

మందమర్రిరూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదర్శ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని జి. అను రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సారా తస్నీమ్ సోమ వారం తెలిపారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైనందన్నారు. ఈ నెల 14 నుంచి 17 వరకు నల్గొండలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గింటుందన్నారు. విద్యార్థినిని ప్రిన్సిపల్, పీడీ చిన్నక్క, కోచ్ సురేందర్ అభినందించారు.

వీరాపూర్‌లో పత్తి దగ్ధం

కన్నెపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వీరాపూర్ గ్రామంలోని పడాల శ్రీమతికి చెందిన పత్తికి ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధమైంది.

శ్రీమతి తన ఇంటి పెరటిలో పత్తిని నిల్వచేయగా నిప్పంటుకుని పత్తి కాలిపోయింది. సుమారు 8 క్వింటాళ్ల పత్తి కాలిపోయిందని నష్టపరిహారం ఇవ్వాలని కోరింది. పత్తిని ఏఈవో విజయ్ సందర్శించి వివరాలను సేకరించారు.

జాగృతి వారపత్రిక విడుదల

చెన్నూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జాగృతి వార పత్రికను సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ విడుదల చేశారు. ఈ వార పత్రికను సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఎంపీడీవో మోహన్, గాయత్రిబ్యాంకు మేనేజర్‌తో పాటు విద్యా సంస్థలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు దేశం విదేశీయుల దురాక్రమాల కారణంగా, కాంగ్రెస్ పార్టీ సుదర్ఘ సంతుష్టీకరణ విధానాల వల్ల భారత్ తన స్థానాన్ని కోల్పోయిందన్నారు. కానీ స్వయం సేవక్ సంఘ్ వంద సంవత్సరాలుగా చేస్తున్న కృషి వల్ల భారతదేశం తిరిగి విశ్వ గురువుగా తన స్థానాన్ని దక్కించుకోబుతుందన్నారు. పట్టణాధ్యక్షుడు శ్రీపాల్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్‌లో విద్యార్థిని ప్రతిభ

దండేపల్లి, నవంబరు, 10(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం తాళ్లపేట జిల్లా పరిషత్ ఉన్నత మారిసేని అంజలి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యున్నతమైన ప్రతిభ కనబరిచ్చనట్లు పాఠశాల హెచ్ఎం సుదర్శన్ సోమవారం తెలిపారు. ఈనెల 7న పులిమడుగులో నిర్వహించిన 17సంవత్సరాల జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని పాఠశాల హెచ్ ఎంతో పాటు ఫిజికల్ డైరెక్టర్ వరకుమారి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఆసుపత్రులు ఎంత భద్రం..?

(5వ పేజీ తరువాయి)

రెండు వైపులా వ్యతిరేఖ దిశలో విశాలమైన మెట్లు ఏర్పాటు చేయాలి. ప్రమాదాలు సంభవిం చిన పుడు ఒకదారి మూసుకుపోతే మరోదారిన రోగులు బయటకు వచ్చే విధంగా మెట్లు ఏర్పాటు చేయాలి. భవనాల్లో సైతం ఒక వరండాలో ప్రమాదం జరిగితే మరో వరండా నుంచి బయటకు వెళ్లే ఏర్పాట్లు ఉండాలి. అలాగే ఇంకో వైపు ఇనుముతో వెడల్పైన రాంపులు ఏర్పాటు చేయాలి. జిల్లా కేంద్రంలో ప్రస్తుతం ఏ ఆస్పత్రిలో చూసిన ఒకవైపు మెట్లే దర్శనమిస్తుండగా, రాంపులు ఉండటం లేదు.

భద్రతా చర్యలు ప్రశ్నార్ధకమే...

అగ్నిమాపకశాఖ నిబంధనల ప్రకారం జీ +4 భవ నం ఎత్తు కనీసం 15 మీటర్లు ఉంటే తప్పనిసరిగా ఫైర్ సేఫ్టీ నో ఆబ్జక్షన్ సర్టిఫికేట్ పొందాల్సి ఉంది. అయితే అనేక భవనాల నిర్మాణాలు నిబంధనల మేరకు చేప ట్టకపోవడంతో ఫైర్ డిపార్టుమెంటు నుంచి నో ఆబ్జక్షన్ పొందే అవకాశం కూడా లేదు. అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో కేవలం ఆసుపత్రులలోని పేషెంట్లేగాక, ఆయా గదుల్లోని అత్యంత విలువైన పరికరాలు అగ్నికి ఆహుతయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. దీంతో ఆసుపత్రుల యాజమాన్యాలకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది. అనుకోని విధంగా మంటలు చెల రేగిన సమయంలో వాటిని ఆర్పేందుకు కార్బన్ డయాక్సైడ్, హైడ్రేంట్ సిస్టమ్, డ్రై కెమికల్ పౌడర్‌తో కూ డిన ఫైర్ ఎస్టింగిషర్లు అందుబాటులో ఉంచుకోవాలసి ఉంది. పరికరాలను అందుబాటులో ఉంచుకోవడంతోపాటు సిబ్బందికి వాటిని ఉపయోగించడంలో అవగాన కల్పించాలి. చాలా వరకు సంభవించే అగ్నిప్ర మాదాలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమవుతోంది. ఏసీలు నిరంతరంగా ఒకే విధంగా నడిపితే వేడిపుట్టి మంటలు చెలరేగే ప్రమాదం ఉంది. ఒకే సమయంలో అన్ని ఏసీలు ఆన్ చేయకుండా మార్చి ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చును. అలాగే విద్యుత్ వైరింగ్ పట్ల కూడా అప్రమత్తత అవసరం. వినియోగించే విద్యుత్‌కు సరిపడా వైరింగ్ స్థాయి ఉందో లేదో చెక్ చేసుకోవాలి. అలాగే కనీస ఫైర్ ఫైటింగ్ పరికాలు ఏర్పాటు చేసుకోవాలి. అవి పనిచేస్తున్నాయో లేదో తరుచుగా పరిశీలించడం ద్వారా అగ్రిప్రమాధాల నివారణకు చర్యలు చేపట్టాలి. అలాగే అగ్నిమాపక శాఖ అధికారులు కూడా ఆసుపత్రులను తరుచుగా పర్యవేక్షిస్తూ నిబంధనలు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఘనంగా ఆవిర్భావ వేడుకలు

కన్నెపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ కొలవార్ సంక్షేమ సంఘం 43వ ఆవిర్భావ వేడుకలను సోమవారం కన్నెపల్లి మండల కేంద్రంలో ఘనంగా నిర్వహిం చారు. జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆదివాసీ కొలావార్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించా లన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొడిపె వెంకటేష్, నాయకులు వెంకటేష్, రాములు, నాగులు, లచ్చులు, మొండి, బాపు, భీమేష్, శంకర్, బీమయ్య, బాయక్క తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ ఇవ్వాలని నిరసన

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి గ్రస్తులకు వికలాంగుల పింఛన్ ఇవ్వాలని కలెక్టరేట్ కార్యాలయం ముందు సోమవారం తలసేమియా సికిల్ సెల్ వెల్ఫేర్ సొసైటి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ తలసేమియా సికిల్‌సెల్ వ్యాధి గ్రస్తులకు సదరం శిబిరాలను నిర్వహించి సర్టిఫికెట్లు అందించి పింఛన్‌లు ఇవ్వాలన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

లక్షెట్టిపేట, నవంబరు, 10(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం సూరారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ జాడే ఉత్తమ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ రంగానికి ఏలాంటి కోతలు లేకుండా పూర్తి స్థాయిలో నాణ్యమైన విద్యుత్తు అందిచడం కోసం 5ఎంఏ సామర్థ్యం గల నూతన టెక్నాలజీ గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి నట్లు రైతుల విద్యుత్ మోటార్లు కాలిపో కుండా ఉండేందుకు అనుగుణంగా ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, చిన్నయ్య

కాసిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దిమాడలో స్వయంగా వెలిసిన శివలింగానికి ఆలయం నిర్మాణం చేపట్టిన భక్తులు సోమవారం లింగం ప్రతిష్ఠాపనతో పాటు ఆంజనేయ, సంతాన నాగేంద్ర, నవగ్రహ శిలా విగ్రహ సహిత ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల, బెల్లం పల్లి మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యలు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతం మద్దిమా డలో ఆలయ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వై. శ్రీనివాస్, తట్ర భీంరావు దంపతులను అభినందించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో మద్దిమాడలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్వయంగా శివలింగం వెలువడంతో ఆలయ కమిటీ సభ్యులు ఆలయాన్ని నిర్మించడంతో పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బొల్లు రమణారెడ్డి, గొంది వెంకట రమణ, మాజీ జెడ్పీటీసీ పల్లె చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, నాయకులు సంజీవ్, సుధాకర్‌రెడ్డి, భూమయ్య, అట్కపురం రమేష్, గజానంద్, తిరుపతి, జంగు, సుధాకర్‌రెడ్డి, సుధీర్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డీఈవో

మంచిర్యాల క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం సైన్స్ కేంద్రంలో జిల్లా స్థాయి వ్యాస రచన పోటీలు, ఉపన్యాస, క్విజ్, టాలెంట్ టెస్టు విభాగాలలో పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రం నుంచి 18 మండలా లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎం అక్షర, జి విద్య, ఎండి ఆసిఫాలు ఎంపిక కాగా జిల్లా స్థాయి పోటీల్లో శ్రీవిద్య, శివజ్యోతి, అఖిల్, ఎల్ కీర్తన, సుశాంత్, ఎం అక్షిత బహుమతులు పొందారు.

ఈ సందర్భంగా విద్యాధికారి యాదయ్య విద్యార్థులను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎస్‌జీ హెచ్ఎంఎ అధ్యక్షుడు రాజగోపాల్, జనరల్ సెక్రెటరీ రాథోడ్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిటౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15న నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఉన్న కక్షిదారులు కేసులను పరిష్కరించుకోవాలన్నారు. చిన్న చిన్న కేసులు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, సివిల్ తగాదాలు, చెక్‌బౌన్స్ తదితర రాజీపడే కేసులను లోక్ అదాలత్‌తో పరిష్కరించబడతాయని తెలిపారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌పై ప్రచారం చేస్తున్నామన్నారు. ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

నట్టేట ముంచిన వర్షాలు

- వరి ఎదుగుదల లేక 200 ఎకరాల్లో పంట నష్టం
- ఆందోళనలో రైతులు



మల్కేపల్లిలో ఎదుగుదల లేని వరి పొలాన్ని దున్నుతున్న రైతు

కాసిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వారం రోజుల క్రితం మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరి ఎదుగుదల లేక నాటు దశలోనే ఉండిపోయాయి. దీంతో అంతుచిక్కని వ్యాధి బారిన పడ్డ పంటకు ఎన్ని మందులు వేసినా ఎదుగుదల లేక కొసలు ఎండిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాసిపేట మండలం రొట్టెపల్లి నర్సింగసాగర్ చెరువు కింద సాగు చేసిన 200 ఎకరాల్లోని పంటల పరిస్థితి దయనీయంగా మారింది. నర్సింగసాగర్ ఆయకట్టు కింద సుమారు 500 ఎకరాల్లో వరి సాగు చేశారు. కానీ 200 ఎకరాల్లోని వరి నాటువేసినప్పుడు ఉన్నట్లుగా ఎదుగుదల లేక నిలిచిపోయింది. రైతులు ఎన్ని మందులు వాడినా పంట ఎదుగుదల లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో కొందరు రైతులు ట్రాక్టర్లతో ఎదగుదల లేని వరిని దున్ని చదును చేశారు. జింక్‌లోపం ఏర్పడి పంటలో ఎదుగుదల లేదని వ్యవసాయాధికారులు చెబుతున్నారని రైతులు తెలిపారు. బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.

కార్మికులు పని స్థలాల్లో అప్రమత్తంగా ఉండాలి

కాసిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :కార్మికులు పని స్థలాల్లో అప్రమత్తంగా ఉంటూ పనులు చేయాలని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ అన్నారు. సోమవారం కాసిపేట 1వ గనిని సందర్శించి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించే కార్మికులు పని స్థలాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాద రహిత గనులుగా తీర్చిదిద్దడానికి కార్మికులు కృషి చేయాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాల సాధన కోస అందరు కృషి చేయాలన్నారు. మొదటిసారిగా గనికి వచ్చిన సబ్ కలెక్టర్ గని మేనేజర్ సతీష్ ఘనంగా శాలువాలతో సన్మానించారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

లక్సెట్టిపేట, నవంబరు, 10(ఆంధ్రజ్యోతి): ఈరోజు లక్సెట్టిపేట పట్టణంలోని రైతు వేదికలో మండలంలోని లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేస్తామని తహసీల్దార్ దిలీప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈచెక్కులను మంగళవారం ఉదయం 11గంటల నుంచి పంపిణీ చేస్తున్నట్లు మండలంలోని లబ్దిదారులతో పాటు వారి తల్లితండ్రులు తప్పకుండా హాజరు కావాలని ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

లక్సెట్టిపేట, నవంబరు, 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నేటి నుంచి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ మంగ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు అండర్ 14, అండర్ 19 విభాగంలో ఉంటాయని వీటి ప్రారంభోత్సవ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ప్రముఖులు హజరువుతున్నట్లు ప్రిన్సిపల్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

లక్సెట్టిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మున్సిపాలిటీలోని ఊత్కూర్ రేషన్ డీలర్ అక్రమాలు చేస్తున్నారని లబ్దిదారులకు బియ్యం ఇవ్వకుండా వాడుకున్నట్లు స్థానిక తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు వినియోగదారుడు రామయ్య సోమవారం కార్యాలయంలో ఫిర్యాదు చేసారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా ఫిర్యాదు చేసిన వ్యక్తి పేరుతో పాటు తన భార్య పేరు మరో కుటుంబంలోని రేషన్ కార్డులో ఉండటంతో వాటిని తొలగించడంతో ఇద్దరూ ఫిర్యాదులు ఇచ్చారని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

ఆసుపత్రులు ఎంత భద్రం..?

- కనీస సౌకర్యాలు లేనిచోట దవాఖానాల ఏర్పాటు
- నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు
- కనీస భద్రతా చర్యలు శూన్యం



మంచిర్యాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లో ఏదేని అనుకోని ప్రమాదం సంభవిస్తే భారీ మూల్యం చెల్లించక తప్పని పరిస్థితులు ఉన్నాయి. ఆసుపత్రుల్లో రోగుల కోసం కనీస రక్షణ చర్యలు చేపట్టడం లేదని తెలుస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఓ ఆసుపత్రిలోని ఐసీయూలో జరిగిన అగ్ని ప్రమాదంలో 15 మంది రోగులు సజీవ దహనం అయ్యారు. ఆ ఆసుపత్రిలో రోగులు బయటకు వెళ్లే మార్గం లేకనే ప్రాణనష్టం జరిగిందని అక్కడి అధికారులు వెల్లడించారు. మంచిర్యాలలోనూ అదే మాదిరి ఆ సుపత్రుల్లో రోగులకు చికిత్స అందిస్తుండటం గమ నార్హం. జిల్లా కేంద్రంలో రోజు రోజుకూ నూతనంగా ఏర్పాటు చేసే ఆసుపత్రుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. రోగుల రక్షణార్థం కనీస భద్రత చర్యలు చేపట్టడంలో యాజమాన్యాలు నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్నాయి. ఈ విషయమై సంబంధిత అధికారులు దృష్టిసారించి, ముందస్తు రక్షణ చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది.

కనీస సౌకర్యాలు కరువు...

జిల్లా కేంద్రంలో ఉన్న చిన్న పెద్ద ఆసుపత్రుల్లో ఎక్కడ చూసినా ఒకటి రెండు మినహా మిగతా వాటిలో కనీస సౌకర్యాలు కూడా అందుబాటులో లేవు. కనీసం వాహన పార్కింగ్ స్థలం కూడా లేకపోవడం గమనార్హం.

ఇరుకు రోడ్లు, సందుల్లోనూ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబు లెన్స్ వచ్చి అక్కడ నిలిపి ఉంచే పరిస్థితి లేదంటే అతిశయోక్తి కాదు. ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న కొన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు రోగులతో పాటు, వారి అటెండెంట్లు వేచి ఉండేందుకు కూడా అవసరమైన ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు...

ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్న అనేక భవనాల నిర్మాణం నిబంధనల మేరకు ఉండటం లేదు. కార్లు వెళ్లలేని గల్లీల్లో వెలిసిన ఆసుపత్రులు పదుల సంఖ్యలో ఉన్నాయి. అప్పటికే నిర్మాణంలో ఉన్న భవనాలనే, ఇతరత్రా అవసరాల కోసం నిర్మించిన వాటినో ఎంపిక చేసుకొని ఆసుపత్రులు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రోగుల గదులు గాలి, వెలుతురుకు అవకాశం లేకుండా ఉంటున్నాయి. అగ్నిమాపకశాఖ నిబంధనల ప్రకారం ఏదైనా అనుకోని అగ్ని ప్రమాదం సంభవించిన సమయంలో ఫైర్ ఇంజిన్ భవనం చుట్టూ తిరిగి మంటల ఆర్పేందుకు ఏర్పాట్లు ఉండాలి. అలాగే బహుళ అంతస్థుల భవనాలకు..

(తరువాయి 7లో)

పత్తిపై కత్తి కట్టిన లద్దెపురుగు

- పంట ఆఖరు దశలో విజృంభణ
- రోజుల వ్యవధిలో చేనంతా మేస్తున్న చీడ

7

విద్యార్థినులతో టీచర్ అసభ్య ప్రవర్తన

- డీఈవోకు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు
- విచారణ చేపట్టిన అధికారులు

6

24గంటల్లో ఆక్రమణలు తొలగించాలి

డీఎఫ్‌వో రామ్మోహన్



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో రామ్మోహన్

దండేపల్లి, నవంబరు, 10(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలో వేసిన ఆక్రమణలను 24గంటల్లో తొలగించాలని జన్నారం అటవీ శాఖ డివిజనల్ ఆఫీసర్ రామ్మోహన్ ఆక్రమణ దారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు దండేపల్లి మండలం దమ్మన్నపేట గ్రామంలోని అటవీ ప్రాంతానికి అటవీ శాఖ అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో కలిసి వెల్లి ఆక్రమదారులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈసందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ 24గంటలో ఆక్రమణదారులు వేసిన ఆక్రమణలను తొలగించకుంటే తామే తొలగిస్తామన్నారు. ఆక్రమణలను తొలగించడంతో పాటు అట్టి స్థలాల్లో నీలగిరి, వెదురు ప్లాంటేషన్ కూడా వేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో డీఎఫ్‌వో వెంట ఎఫ్ఆర్‌వో సుస్మరావు, తహసీల్దార్ రోహిత్‌పాండే, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎపీవో దుర్గాదాస్, ఎంపీవో ప్రసాద్ ఉన్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



బోరు వద్ద నిరసన తెలుపుతున్న ప్రజలు

భీమారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోలంపల్లి గ్రామంలోని అంకుశాపూర్‌లో నాలుగు నెలలుగా బోరు బావి పనిచేయక తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొన్నారు. సోమవారం ఖాళీ బిందెలతో బోరు బావి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ అంకుశాపూర్‌లో నాలుగు నెలలుగా బోరు పపనిచేయకపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామన్నారు. మిషన్ భగీరథ నీరు వచ్చినా సరిపోవడం లేదని, నీరు కలుషితమై వస్తుందన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే బోరు బావికి మరమ్మత్తులు చేయించాలని నీటిని అందించాలని లేకుంటే ఆందోళనలు చేస్తామన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సంఘం నాయకులు

మంచిర్యాల క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గౌరవ అధ్యక్షుడు దేవి సత్యం, మాజీ కౌన్సిలర్ బానేష్ కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ సంపత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్య భారిన పడి, వయసు పైబడి విధులు నిర్వహించలేకపోతున్న వారి స్థానంలో గత పదేళ్లగా వారి కుటుంబ సభ్యులు విధులు నిర్వహిస్తూ వస్తున్నారని, ఇంత వరకు మున్సిపల్ ఆఫీస్‌లో ఈపీఎఫ్‌లో పేర్లను నమోదు చేయలేదని, వారి పేర్లు నమోదు చేయడంతో పాటు వారి అకౌంట్‌లోనే వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మరణించిన వారి స్థానంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ఈపీఎస్‌లను కార్పొరేషన్ ఆఫీస్‌లో పేరు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చిప్పకుర్తి నర్సింగ్, రాజేష్ పాల్గొన్నారు.

గుడిరేవు పాఠశాలలో సైన్స్‌ఫెయిర్

దండెపల్లి, నవంబరు, 10 (ఆంధ్రజ్యోతి): గుడిరేవు ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం విద్యార్థులు సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ద్వారక స్కూల్ కాంప్లెక్స్ హెచ్ ఎం నర్సయ్య హాజరై వివిధ పరికరాలను తయారు చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంపై విద్యార్థులు పట్టు పెంచుకోవాలని వివధ పరికరాలను తయారు చేయడంతో పాటు వాటి వినియోగంపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. రానున్న రోజుల్లో మంచి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బొలిశెట్టి బుచ్చన్న, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ స్వరూపతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఓఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజబాబు రెడ్డి

శ్రీరాంపూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఐసీ ఏజెంట్స్ అర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఏఓఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మంచిర్యాలకు చెందిన పాలమాకుల రాజబాబు రెడ్డి ఎన్నికయ్యారు. ఏఓఐ సౌత్ సెంట్రల్ జోనల్ 6వ మహాసభలు ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగాయి. ఆల్ ఇండియా అధ్యక్షుడు సుర్జిత్ కుమార్ బోస్, ప్రధాన కార్యదర్శి పి.జి. దిలీప్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంజునాథ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి శ్రీనివాస రావు సమక్షంలో ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా రాజబాబురెడ్డిని ఎన్నుకోగా, పలువురు ఆయనను సన్మానించారు. రాజబాబు రెడ్డి ఏఓఐ రాష్ట్ర ఉపాధ్యక్షు డిగా ఎన్నిక కావడంపై సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మందమర్రి, సారంగపల్లి, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, మంచిర్యాల, హాజీపూర్ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందించారు. తలసేమియా సికిల్ సెల్ సొసైటి ప్రతినిధులు తలసేమియా వ్యాధిగ్రస్తులకు సదరం శిబిరాలను నిర్వహించి పింఛన్‌లు అందించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరకాస్తులను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్‌ప్రభుత్వం హయంలో నిర్మించిన 300 డబుల్‌బెడ్ రూం ఇళ్లను తక్షణమే ప్రభుత్వం పేదలకు అందించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. పట్టణాధ్యక్షుడు గాదె సత్యం, నాయకులు సుధీర్, రవీందర్ రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

రైతుల సౌకర్యం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

రైతుల సౌకర్యం కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. రైతుల సౌకర్యం కోసం కంట్రోల్ రూమ్ నెంబర్ 6303928682ను ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రస్థాయిలో 1967, 180042500333 ఉన్నాయన్నారు.సందేహాలు, ఫిర్యాదులు ఉంటే తెలియజేయాలన్నారు.

'అమ్మకు అక్షరమాల'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

భీమారం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలోని అమ్మకు అక్షరమాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఓబీలు, వీవోఏలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులను గుర్తించి వారికి చదువు నేర్పించడం కోసం వలంటీర్లను గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేశామన్నారు. ప్రతి గ్రామసంఘం నుంచి ఇద్దరు ఓబీలకు, వీవోఏలకు శిక్షణ పొందిన సీఆర్‌పీలు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని అక్షరకేంద్రాల ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. అంకిత భావంతో అందరు కలిసి పని చేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలబెట్టాలన్నారు. నిరక్షరాస్యులు చదువు నేర్చు కోవడం ద్వారా సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని, వారి పనులు వారే స్వయంగా చేసు కుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యా ధికారి పురుషోత్తం, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, ఎంపీడీవో కార్యాలయం సూపరింటెండెంట్ సంజీవస్వామి, డీఆర్‌పీ సుమన్, సీఆర్‌పీలు స్వప్న, రజిత పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే...?

● విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న ఇనుప డబ్బా... రోడ్డుపై అడ్డంగా సూచిక బోర్డుకు సంబంధించిన రాడ్డు

నస్పూర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తా జాతీయ రహదారిపై మంచిర్యాల, చెన్నూరు, కరీంనగర్ వైపు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రధాన రహదారిపై మంచిర్యాల వైపు డివైడర్ కు గతంలో పెట్టిన సూచిక బోర్డు ప్రస్తుతం లేకపోవడంతో దానికి పెట్టిన ఇనుప రాడ్డు మాత్రమే మిగిలింది. నిత్యం వాహనాలు మూల మలుపుల తిరుగుతుంటాయి. అలాగే శ్రీరాంపూర్ వైపు నుంచి నస్పూర్ కాలనీ వైపు వందలాది వాహనాలు వెళ్తాయి.

తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నుంచి ఏర్పాటు చేసిన స్ట్రీట్ లైట్ స్తంభానికి ఒక ఇనుప డబ్బా వేలాడుతుంది. డివైడర్ వద్ద ఇనుప రాడ్డు, స్ట్రీట్ లైట్ స్తంభానికి వేలాడిన డబ్బాకు పొరపాటున వాహనం అదుపు తప్పి తగిలితే ప్రమాదం జరిగే అవకాశం పొంచి ఉన్నది. సంబంధిత అధికారులు ఈ రెండు ప్రాంతాల్లో ఉన్న ఇనుప రాడ్డును, వేలాడుతున్న డబ్బాను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.





తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద రోడ్డుపై సూచిక బోర్డు ..చౌరస్తాలో విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న ఇనుప డబ్బా